క్లుప్తంగా

ఆగస్టు 3నుంచి సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి వారం రోజుల పాటు సప్తాహ భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డిలు తెలిపారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు వారంరోజుల పాటు నిర్వహించే ఈ సప్తాహ భజన కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వారు పేర్కొన్నారు. భజన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉచిత న్యూరో ఆరోగ్య వైద్య శిబిరం



మానవపాడు: మండల కేంద్రంలోని అమరవాయిలో మంగళవారం వీఎస్‌టీ సంజీవని, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యూరో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ వీవీఎస్‌టీ మేనేజర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ క్యాంప్లో డాక్టర్ దుర్గ న్యూరో ఫిజిసియాన్ ఆధ్వర్యంలో 175 పైగా వైద్య పరీక్షలు, మందులు, రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, సంజీవని డాక్టర్ రమ్య, ఫార్మసిస్ట్ ఆర్. రమ్య, ల్యాబ్ టెక్నీషియన్ నిరంజన్‌షెట్టి, ఎమ్‌ఎమ్‌యూ ఆపరేటర్ హీజిబాషా పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల విడుదల



గద్వాల అర్బన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం వద్ద చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే న్యాయమైన డిమాండ్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విధంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆశన్న, ప్రేమదాస్, నరేష్, దావిద్, జయన్న ఉన్నారు.

మండలానికి 243 కల్యాణలక్ష్మి చెక్కులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 243 మంది కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనట్లు తహసీల్దార్ జుబేర్‌అహ్మద్ తెలిపారు. కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో జేఏసీ, సీఐటీయూ నాయకులు



గట్టు: జోగుళాంబ గద్వాల జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఉసేనప్ప మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఉసేనప్పను రాయాపురంలో తెల్లవారు జామున అదుపులోకి తీసుకుని గట్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆశా కార్యకర్తలు చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలపడంతో వారిని ఎస్‌ఐ శ్రీనివాసులు ముందస్తు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆశాల డిమాండ్లపై చలో హైదరాబాద్ కార్యక్రమానికి ముందస్తు అరెస్ట్ సరికాదని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అతివలకు అందలం

- మహిళా సాధికారతకు ప్రోత్సాహక రుణాలు
- ప్రతి మహిళకు సభ్యత్వం ఉండేలా ప్రణాళిక
- ఈ ఏడాది లక్ష్యం రూ.23.53 కోట్లు


గోకులపాడులో మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో చర్చిస్తున్న మహిళలు (ఫైల్)

మానవపాడు: ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. వారికి సకల సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యాపారపరంగా రాణించేందుకు అనేక రకాల అవకాశాలు కల్పిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరికొంతమందికి అందించాలనే ఉద్దేశంతో నూతన సభ్యత్వాలు, నూతన పొదుపు సంఘాలను ప్రోత్సహించే దశలో అధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రతి మహిళకు సభ్యత్వం ఉండేలా కార్యచరణ రూపొందించి, ఇందుకు లక్ష్యాలు విధిస్తున్నారు. మానవపాడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 571 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో మొత్తం 6,184 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు ఏ పొదుపు సంఘాలలో లేని వారిని గుర్తించి సభ్యత్వం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది ప్రభుత్వ లక్ష్యం రూ.23.53కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు దాదాపు 3.01కోట్లు వసూలు చేశారు. 20.52కోట్లు రుణాలను పొదుపు సంఘాల సభ్యులకు అందించాలి.

కొత్త కోడళ్లకు అవకాశం..

లక్ష్య సాధనలో గ్రామాల వారీగా కొత్తగా సంఘంలో సభ్యులను చేర్పిస్తున్నారు. ఇందుకోసం ఐకేపీ అధికారులు వివిధ రకాల ప్రణాళికలు రూపొందిస్తూ కసరత్తు చేస్తున్నారు. 60ఏళ్లు దాటిన సభ్యులకు ఆయా సంఘాల నుంచి సభ్యత్వాన్ని రద్దు చేస్తుండటంతో కొత్తగా వారిని చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు చాలా మంది సభ్యులను చేర్పించారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు..



తెలంగాణ ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు అందించడం మంచి నిర్ణయం. మహిళలను బలోపేతం చేయడం కోసం మహిళలకు రూ.1లక్ష వరకు వడ్డీలేని రుణాలను అందిస్తోంది. మహిళా సంఘాలలో చదువుకున్న వారికి సబ్సిడీ అందించి ఆర్థికంగా ప్రోత్సహించాలి.

– గాయత్రి, అరుణోదయ మహిళా సంఘం, చెన్నిపాడు

ప్రచారం చేస్తున్నాం..



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలపై ఆయా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. కొత్తగా వచ్చే కోడళ్లను సైతం సభ్యులుగా చేర్చుకునేందుకు ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం.

– ఎండీ మహబూబ్ బాషా, సీసీ మానవపాడు

సంఘాల సభ్యులకు సబ్సిడీ అందించాలి



తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది. రుణాలు చెల్లింపులు, వ్యాపార, చిన్న పరిశ్రమల స్థాపనకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. ప్రభుత్వానికి మహిళలు రుణపడి ఉంటారు.

– ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కలుకుంట్ల

సద్వినియోగం చేసుకోవాలి..



నూతన సంఘాలలో సభ్యులను చేర్పించేందుకు అవకాశం కల్పించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది మండలంలో టార్గెట్ రూ.23.53కోట్లు రుణాలు మార్చి నాటికి పూర్తి చేస్తాం.

– భీమన్న, ఏపీఎం, మానవపాడు

రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్


మానవపాడులో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు,అధికారులు


గొర్లఖాన్‌దొడ్డిలో రుణమాఫీ నిధుల విడుదలను వీక్షిస్తున్న ఏఈఓలు, రైతులు

మానవపాడు: మండల కేంద్రంలోని రైతువేదిక నందు మంగళవారం మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతులు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించిన రుణమాఫీ దృశ్యాలను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. రైతులకు సందేహాలు ఉంటే ఆయా గ్రామాల రైతువేదికల యందు వ్యవసాయ విస్తరణ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి రైతు వేదికలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీకి సంబంధించి నిధుల విడుదలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెండో విడత రుణమాఫీ నిధుల విడుదలను వ్యవసాయ అధికారులతో పాటు రైతులు వీక్షించారు. వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, గొర్లఖాన్‌దొడ్డి ఏఈఓ అనిత, వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రాజోళి: ప్రభుత్వం రెండో విడత రుణమాఫీపై మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీపై ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. రుణమాఫీ అయిన రైతులకు త్వరగా రుణాలు అందించే విధంగా బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అధికారుల సలహాలు పాటించాలి


మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

మల్దకల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరి పాటించాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. వీసీ ద్వారా వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు నేరుగా రైతులు, అధికారులతో మాట్లాడారు. పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


మానవపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను మంగళవారం సూపర్‌వైజర్ ఆస్మా, మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర బాత్‌రూంలు, పేయింటింగ్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మానవపాడులో 2, 3, 4 అంగన్‌వాడీ సెంటర్లను, పల్లెపాడు 2, బుర్థిపాడు 1 అంగన్‌వాడీ సెంటర్లను బాత్‌రూంలు, పేయింటింగ్ కోసం పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి



గద్వాల అర్బన్: భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన నిర్వాసిత రైతుల జిల్లా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి బహిరంగ మార్కెట్లో ఉన్న ధర కంటే అదనంగా చెల్లించాలన్నారు. భూములతో పాటు బావులు, బోర్లు, పైపులైన్లు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని చట్టం చెబుతున్నా.. అవేమి పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పరిధిలోని 19 గ్రామాల్లో రైతుల నుంచి రెండు విడుతల్లో దాదాపు 800 ఎకరాల భూమి సేకరించినా.. తగిన నష్టపరిహారం ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పడం సరికాదన్నారు. నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల్‌రెడ్డి, రాయిచూర్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ఈదన్న, ఉప్పేరు నర్సింహ, గట్టన్న తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం –6కు అంగన్‌వాడీ టీచర్, ఆయా ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ ఆస్మా పిల్లలకు ఇచ్చే గుడ్లను, హాజరు శాతాన్ని పరిశీలించింది. ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రం –6ను పరిశీలించగా.. మూసి ఉంచారు. దీంతో అంగన్‌వాడీ టీచర్‌కు మంగళవారం మెమో జారీ చేస్తున్నట్లు తెలియజేశారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి


అమరవాయిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేష్‌లు తెలిపారు. మంగళవారం మండలంలోని అమరవాయి కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుపట్ల ఉన్న భయాన్ని తొలగించి వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేసి ఉన్నతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలందరిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పద్మావతి, పరుమన్న, బాలగౌడ్, వెంకటేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దాతలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృష్ణవేణి, ఉపాధ్యాయుడు శేషన్న గార్ల పుత్రిక శ్రీనిక పుట్టిన రోజు సందర్భంగా మండల విద్యాధికారి నరసింహులు చేతుల మీదుగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చాలామంది డబ్బున్నవాళ్లు వారి పిల్లల పుట్టినరోజు వేడుకలకు వేల రూపాయలు ఖర్చు చేస్తారని, ఇలా ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు అవసరమైన సామగ్రి అందజేస్తే బాగుంటుందన్నారు. నిరుపేద విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేయాలన్న ఆలోచన వచ్చినందుకు శ్రీనిక తల్లిదండ్రులను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో కొంకల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అన్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజ, పాఠశాల స్థలదాత వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవి, ఎంవీ ఫౌండేషన్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తాం


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న పూర్వపు విద్యార్థులు

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెడతామని ఎంపీడీఓ రమణ అన్నారు. వడ్డేపల్లి మండల బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కమిటీ సమావేశం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లల పరిరక్షణ కోసం పాటుపడుతున్న వారందరికి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ జోషి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ బృందం నిత్యం పాఠశాలలను పరిశీలిస్తుండడం మంచిదన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను ఎంపీడీఓ, తహసీల్దార్‌కు సీఆర్‌పీఎఫ్ బృందం వినతి పత్రం అందజేశారు. మనఊరు–మన బడి కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తిచేయించి, ఉపాధ్యాయుల కొరత లేకుండా భర్తీ చేయించి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని కోరారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు శివరాములు, కే.భూపాల్, రాఘవేంద్రాచారిలు పాఠశాలకు జూలెకల్ నుంచి నడుచుకుంటూ వచ్చే ఆరుగురు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.

అటెన్షన్ ప్లీజ్



బస్సుల కోసం పడిగాపులు..



గట్టు: పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి చేరేందుకు విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తున్నారు. గట్టు ఉన్నత పాఠశాలకు రాయాపురం, పెంచికలపాడు, తప్పెట్లమొర్సు, గొర్లఖాన్ దొడ్డి, యల్లందొడ్డి గ్రామాల నుంచి ప్రతిరోజు విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారు. ఉదయం పాఠశాలకు ఏదైనా వాహనంపై చేరుతారు. సాయంత్రం బడి విడిచిన తర్వాతే ఇంటికి వెళ్లడానికి కష్టంగా మారుతోంది. బడి విడిచాక రాయాపురం బాలికలు పెట్రోల్ బంకు చౌరస్తా దగ్గర లిఫ్టు కోసం ఎదురు చూస్తుంటారు. ఈ రూట్‌లో ఉదయం 8.30 గంటలకు గట్టుకు రావడానికి బస్సు ఉంటుంది. సాయంత్రం 4గంటల తర్వాత బస్సు వస్తే వస్తది, లేకపోతే అంతేమరి. 10 నుంచి 15 మంది విద్యార్థులు రోడ్డుపై నిల్చొని లిఫ్టు ఇచ్చే వారి కోసం ఎదురు చూస్తుంటారు. సాయంత్రం వేళ ఆలూరు రూట్లో బస్సు నడపాలని విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రీనివాసరావు, డిపో మేనేజర్, గద్వాల, ఫోన్‌నం.. 9959226290

కళాశాల ఆవరణలో డబ్బాలు తొలగించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

అలంపూర్: ప్రభుత్వ కళాశాల ఆవరణలో వెలసిన డబ్బాలను తొలగించాలని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు కోరారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వరణలో ఉన్న డబ్బాలను తొలగించాలని తహసీల్దార్ మంజులకు వినతి పత్రం అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న డబ్బాలను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తికాక ముందే తిరిగి డబ్బాలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి డబ్బాలు తొలగించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు


గోవు మృతదేహాన్ని భాజాభజంత్రీలతో ఊరేగిస్తున్న గ్రామస్తులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో గోవు చనిపోవడంతో గ్రామ ప్రజలు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. జూలెకల్ గ్రామంలోని దేవుని ఆవు మంగళవారం మృత్యువాత పడింది. దీంతో గ్రామస్తులంతా సమావేశమై మృతిచెందిన గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాజాభజంత్రీలతో ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం గ్రామ సమీపంలో గొయ్యి తవ్వించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు


తెలుగుతల్లి విగ్రహాన్ని ప్రారంభించిన నాయకులు


అమ్మవారి వేషధారణలతో చిన్నారులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆషాఢ మాసం సందర్భంగా ఘనంగా బోనాల పండుగ హేమళాంబ ఆలయ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఐటీఐ కళాశాల నుంచి హేమళాంబ అమ్మవారి ఆలయానికి బ్యాండ్ మేళాలతో, భక్తుల నృత్యాలతో, అమ్మవారి వేషధారణతో ఊరేగించారు. బస్టాండ్‌లో తెలుగుతల్లి విగ్రహాన్ని నాయకులు ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రాముకోటిరెడ్డి, రాముడు, ఖాదర్, పకీర, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


బోనమెత్తిన్న చిన్నారులు, మహిళలు